
# మేమొచ్చిందే సమయం



ఉదయం 10.41కి ఖాళీగా ఉన్న సిబ్బంది గది



ఉదయం 10.42 గంటలకు ఖాళీగా ఉన్న కంప్యూటర్ సిబ్బంది గది

- తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన పాటించని ఉద్యోగులు
- ఇబ్బందుల్లో ప్రజలు

**మహానంది:** తామొచ్చిందే సమయం అన్నట్లు వ్యవహరిస్తున్నారు మండల కార్యాలయ ఉద్యోగులు. దీంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు వారికి కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. తమను అడిగేదెవరు అనుకున్నారో ఏమో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని 'సాక్షి' విజిట్ చేయగా అధికారులు, సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది.

తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 గంటలకంతా విధులకు హాజరు కావాలి. సాయంత్రం ఐదు గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలి. కానీ ఇక్కడ సిబ్బంది మాత్రం వేళలకు హాజరు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం నిర్ణీత సమయానికి ముందే ఇద్దరు అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్ చిన్నరాయుడు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యశ్రీనివాసులు హాజరయ్యారు. ఉదయం 10.45 తర్వాత ఒక్కొక్కరు రావడం ప్రారంభించారు. కంప్యూటర్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది నుంచి ఆర్ఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు, సర్వేయర్, కొంత మంది వీఆర్ఓలు ఉదయం 11 గంటల తర్వాత ఒక్కొక్కరు రావడం విశేషం. అప్పటికే వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అధికారులు, సిబ్బంది కోసం గంట పాటు నిరీక్షించాల్సి వచ్చింది.

### వేళలు పాటించకుంటే చర్యలు

తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించకుంటేచర్యలు తీసుకుంటాం. నిర్ణీ త సమయానికి రాకపోతే మెమోలు ఇవ్వడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. పనులు ఉంటే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

-సత్యశ్రీనివాసులు,
ఇన్‌చార్జ్ తహసీల్దార్, మహానంది

## క్లుప్తంగా

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

**శ్రీశైలంటెంపుల్:** అష్టాదశ శక్తి పీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

### గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీశైలంప్రాజెక్ట్:** గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం బుచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 7న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

### ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



రైతు, పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

**వెలుగోడు:** మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఎలక్ట్రానిక్ పంట నమోదు (ఈ-పంట) కార్యక్రమం సంయుక్తంగా చేపట్టారు. సాగయ్యే అన్ని రకాల పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసి రైతుల మొబైల్ ఫోన్లకు సందేశం పంపుతారు. ప్రభుత్వం అమలు చేసే.. సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, రైతు భరోసా, కనీస మద్దతు ధర, ప్రకృతి విపత్తుల సహాయం తదితర పథకాలకు ఈ-పంట డేటానే ప్రామాణికంగా తీసుకుంటారని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. సాగు చేసిన పంటలను కచ్చితంగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

### తల్లి పాలు ఎంతో శ్రేష్టం

**మహానంది:** చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భావన రెడ్డి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మహిళలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.


### అలరించిన నృత్య ప్రదర్శన




నృత్య ప్రదర్శనలో కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై విశాఖపట్నంకు చెందిన కళారాధన సంగీత, నృత్య అకాడమీ వారి సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. మహాగణపతిం, శివపంచాక్షరీస్తోత్రం, శంకర శశివదన, కాలభైరవాష్టకం, అయిగిరినందిని, గిరిజకల్యాణం తదితర గీతాలకు, అష్టకాలకు నిర్విజ్ఞ, గ్రీష్మ, చంద్రిక, నిహారిక, రాధ తరంగిణి తదితరులు నృత్యం చేశారు.

### డ్యామ్‌కు సందర్శకుల తాకిడి



జలాశయం వద్ద ఫొటోలు దిగుతున్న సందర్శకులు

**శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం జలాశయం వద్ద సందర్శకుల తాకిడి అధికమైంది. డ్యాం గేట్లు తెరచి నీటిని విడుదల చేస్తుండడంతో ఆ అందాలను వీక్షించేందుకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఫొటోలు దిగుతూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ పరవశించిపోతున్నారు.

## వాసవీ మాతకు చీర సారె



అమ్మవారికి చీర సారె తీసుకెళ్తున్న భక్తులు

**వెలుగోడు:** ఆషాడమాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి డప్పువాయిద్యాలతో వాసవీ మాత అమ్మవారికి చీర సారెను పురవీధుల గుండా ప్రదర్శనగా తీసుకెళ్లి సమర్పించారు. అమ్మవారి శాల వద్ద మహిళలు లలితా సహస్ర పారాయణం చదివి వినిపించారు. పురోహితులు నరసరామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి శాల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అమ్మవారిశాల కమిటీ అధ్యక్షుడు లాలంసుధాకర్, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బచ్చు రాము, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, తాళ్లూరి రవికుమార్, నాగపుల్లయ్య, శ్రీరాం నాగేశ్వరరావు, బొగ్గారపు లక్ష్మీనారాయణ, లాలం మల్లికార్జున, సోమా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని మందులు అమ్మరాదు



సమావేశానికి హాజరైన డీలర్లు



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

- ఏడీఏ ఆంజనేయ

**పాములపాడు:** అనుమతి లేని బయో మందులను దుకాణాల్లో అమ్మరాదని ఏడీఏ ఆంజనేయ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మందుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. స్టాక్‌రిపోర్టు ప్రతి నెలా 5వ తేదీ లోపు కార్యాలయంలో ఇవ్వాలన్నారు. అనుమతుల్లేని రసాయన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేని వ్యక్తులు విత్తనాలు, మందులు విక్రయిస్తున్నట్లయితే సమాచారం ఇవ్వాలన్నారు.వ్యాపారం చేయని డీలర్లు లైసెన్స్‌లు మండల వ్యవసాయాధికారికి అప్పగించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పరస్పర ఫిర్యాదుల్లో పది మందిపై కేసు నమోదు

**మహానంది:** మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పరస్పర ఫిర్యాదులతో పోలీసులు శుక్రవారం పది మందిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. ఈశ్వర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు రమేష్ ఇంటిమీదికి అదే కాలనీకి చెందిన భూపాల్, శ్రీకాంత్, సుంకన్న, మహేశ్, శ్యామ్ రాత్రి దాడి చేశారు. రమేష్‌ను గాయపరచడంతో పాటు ఇళ్ల తలుపులు పగలగొట్టి ఇంటి ముందు ఉన్న బొలేరో వాహనాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మరోవర్గంలోని గాయపడిన భూపాల్ ఫిర్యాదు మేరకు రమేష్, చిన్నబాబు, ఆయన కుమారుడు, సురేష్, అంజిలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బంగి వెంకటేశ్వర్లు ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా దాడి చేసిన వారిని పోలీసులు గుర్తించి విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాతో పాటు డీఎస్పీ, సీఐలు ఆరా తీసినట్లు సమాచారం.

## అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

- గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారమేదంటూ నిలదీత
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

**పగిడ్యాల:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గత సమావేశాలలో సభ దృష్టికి తెచ్చిన సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎంపీపీ పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు తరలించాలని మూడు నెలల క్రితం తీర్మానం చేసి నిధులు కేటాయించినా ఇంతవరకు ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. ఈ విషయమై మండల తీర్మానం కాపీ తమకు అందలేదని విద్యుత్ ఏఈ క్రాంతికుమార్, ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజరావు వివరణ ఇచ్చారు. దీంతో ఎంఈఓ సుభాన్ కలుగజేసుకుని విద్యార్థులకు ఏదైనా జరిగితే తమ ఉద్యోగాలు పోతాయని, వీలైనంత త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని కోరారు. దాదాపు రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు పూర్తి చేసినా బిల్లులు ఎందుకు పెట్టడం లేదని పంచాయతీ రాజ్ శాఖ మండల ఇంజినీర్ వెంకటేశ్వర్లును సర్పంచ్ శేషన్న, జెడ్పీటీసీ పుల్యాల దివ్య ప్రశ్నించారు. ఎంపీడీఓ కవిరాజు స్పందిస్తూ ఎంపీటీసీలు జయంతి, మిద్దె స్వాములు, పగడం గోపాల్ మరికొంత మంది ఫిర్యాదు చేశారని సభ దృష్టికి తెచ్చారు. నిత్యవసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా సభ దృష్టికి తీసుకురాగా.. డీలర్లు సరుకులు పంపిణీ చేయడం లేదని, ఎంబీయూ వాహన ఆపరేటర్లు వేస్తున్నారని అవకతవకలకు తావులేదని డిప్యూటీ తహసీల్దార్ మురళీ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం రైతులకు వేస్తామన్న రూ.20 వేలు ఎప్పుడు వేస్తారని ఎంపీటీసీ గోపాల్ వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతకుమార్‌ను ప్రశ్నించారు. ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదన్నారు. సభలోకి బయటి వ్యక్తులను రాకుండా చూడాలని ఎంపీడీఓను ఎంపీపీ కోరారు. సమావేశంలో ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, పశువైద్యులు శ్రుతికీర్తి, రాగసంధ్య, ఏఈలు శివకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్,నరేష్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య పాల్గొన్నారు.



సమస్యను సభ దృష్టికి తెస్తున్న ఎంఈఓ సుభాన్

## పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది:** మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ, వేద పండితులు నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు.

## ఓంకారంలో శాకాంబరీ అలంకార పూజలు



శాకాంబరీ అలంకారంలో అమ్మవారు

**మహానంది:** బండిఆత్మకూరు మండలంలోని శైవ క్షేత్రం ఓంకారం ఆలయంలో కొలువైన గంగాఉమాసమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అలంకార పూజలు నిర్వహించారు. అమ్మవారికి శాకాంబరీ అలంకారం చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి




మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం

**ఆత్మకూరు:** స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ధనుంజయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్, మండల కార్యదర్శి భాస్కర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని 5న చలో కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అన్ని రకాల సదుపాయాలు వారికి అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రణధీర్, కలిముల్లా, పుల్లయ్య, మంజుల, మేరమ్మ, ప్రభావతి, బేగం, భారతి, ఇందిరమ్మ, శంషాద్, అహమ్మద్‌బీ పాల్గొన్నారు.

## సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించండి



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారావు

**మిడుతూరు:** సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో మొక్కజొన్న పైరును పరిశీలించారు. కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతుకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అశోక్, రాము, మాజీ సర్పంచ్ మనోహర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆహ్లాదం కరువు

- కళ్లెదుటే పార్కు ఉన్నా.. నిర్వహణను పట్టించుకోని అధికారులు
- చెత్తాచెదారం, ముళ్లపొదలతో నిండిపోయిన పార్కు

**జూపాడుబంగ్లా:** మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన విలేజ్‌పార్కు అధికారుల నిర్లక్ష్యవైఖరికి అద్దం పడుతోంది. ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే ఉన్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల ప్రజలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజల సౌకర్యార్థం ఎంపీడీఓ, తహసీల్దార్, ఆస్పత్రి, ఎంఈఓ, కార్యాలయాల ఎదుట 2019లో టీడీపీ పాలనలో విలేజ్‌పార్కును ఏర్పాటుచేశారు. ఇందుకు రూ.4.50 లక్షల ఉపాధి నిధులు ఖర్చు చేశారు. మొదట్లో ఎంపీడీఓ, ఉపాధిహామీ పథకం అధికారులు పర్యవేక్షించటంతో ఓ ఏడాది పాటు పార్క్ బాగానే ఉండింది. ప్రజలు, మధ్యాహ్న భోజన విరామం సమయంలో అధికారులు పార్కులో సేదతీరేవారు. ఆ తర్వాత నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో వాకింగ్ ట్రాక్, పార్కులోపల ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రాత్రివేళల్లో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారటంతో పార్కులో కూర్చొనేందుకు ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. నీరు పెట్టకపోవడంతో కొన్ని చెట్లు, పూలమొక్కలు ఎండిపోయి పార్కు కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.




రోడ్డు పక్కన ఉన్న విలేజ్‌పార్కు



ధ్వంసమైన బెంచీలు



కళావిహీనంగా మారిన పార్కు

## వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**వెలుగోడు:** వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి శుక్రవారం మద్రాస్ కాల్వకు 3 వేల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, తెలుగు గంగా అధికారులు విడుదల చేశారు. కృష్ణా జలాలకు పూజలు చేసిన అనంతరం నీటిని హెడ్ రెగ్యులేటర్ నుంచి మద్రాస్ కాల్వ ద్వారా దిగువకు విడుదల చేశారు. అలాగే వన్ ఆర్ తూముకు 50, వన్ ఎల్‌కు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వీబీఆర్ ఇన్‌ఫ్లో 15 వేల క్యూసెక్కులు ఉన్నట్లు గంగ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకొని రైతులు పంటలు పండించుకోవాలన్నారు. నీటిని వథా చేస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. రైతులు అధికారులకు సహకరించాలని, రెండుకార్లకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ సుబ్బరాయుడు, ఈఈ వెంకటేశ్వర్లు, రాజశేఖర్, డీఈలు రమేష్ బాపూజీ, ఆరీఫుల్లా, రవీంద్ర, వెంకట్రామిరెడ్డి, ఏఈలు శివనాయక్, మురళి, మండల టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, ఎంఎ కలాం, ఎల్లాల కష్టుడు, మద్దెల శంకర్‌రెడ్డి, మొమిన్ రసూల్, వీరభద్రుడు, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



డిగ్రీ కళాశాలలో పింగళి గురించి మాట్లాడుతున్న అధ్యాపకులు

**శ్రీశైలంప్రాజెక్ట్:** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడని, భారత జాతిపై ఆయనకు ఉన్న మక్కువతోనే త్రివర్ణ పతాకాన్ని రూపొందించి దేశభక్తిని పెంపొందించారన్నారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ఎం పద్మ, డాక్టర్ కె రాజన్న, డాక్టర్ ఎస్ శివనాగిరెడ్డి, పూర్ణేశ్వరరెడ్డి, శర్మ, షాహిదా, కళ్యాణి, షష్మ, ఇందిరా ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాలల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అబూబకర్ పాల్గొన్నారు.

## తీర్పును పునఃపరిశీలించాలి



నిరసన తెలియజేస్తున్న మాల మహానాడు సంఘాల నాయకులు

**ఆత్మకూరు:** ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సుప్రీం కోర్టు పునఃపరిశీలించాలని మాల మహానాడు సంఘాల నాయకులు మురహరి మల్లయ్య, ఎలీషాల కోరారు. పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా నాయకులు మురారి మల్లయ్య, మల్లె ఎలీషా, ఎస్సీ, ఎస్టీ మార్జిన్ కమిటీ సభ్యులు దిలీప్‌కుమార్, లాయర్ చింతలయ్య మాట్లాడుతూ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు సోమవారం సుప్రీంకోర్టులో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రివ్యూ పిటీషన్ వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు క్రిష్టఫర్, పాతకోట భాస్కర్, రాఘవేంద్ర, అంకిరాజు అనితారావు, సకనాల సురేష్, పాములపాడు నాయకులు అంకన్న, రాజు, నగేష్, పాములపాడు, కొత్తపల్లి, ఆత్మకూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.